సాక్షి
మహబూబ్‌నగర్
మంగళవారం : 6 : జూన్ : 2023



ఐదుగురి దుర్మరణం

ఉమ్మడి జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు మృతి చెందారు.

వివరాలు 8లో ▸



'ఉపాధి' పథకాన్ని ఎత్తేసే కుట్ర

ఉపాధి పథకాన్ని ఎత్తివేసే కుట్ర చేస్తుం దని పరిరక్షణ సమితి ఆరోపించింది.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం 39.5 /21.5

వాతావరణం

ఉదయం నుంచి ఎండ తీవ్రత ఉంటుంది. అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమై తేలిక పాటి వర్షం పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

దశాబ్ది ఉత్సవాలపై ప్రత్యేక దృష్టి

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): రాష్ట్ర ఆవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఈనెల 22 వరకు నిర్వహించనున్న కార్యక్రమాలపై ఆయా శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ రవినాయక్ ఆదేశించారు. సోమవారం ఆయన సమీకృత జిల్లా అధికారుల కార్యాలయంలో వీసీలో సమీక్ష నిర్వహించారు. ముఖ్యంగా 6వ తేదీ నిర్వహించనున్న పారిశ్రామిక ప్రగతి ఉత్సవం, 7వ తేదీన సాగునీటి దినోత్సవం, 8న ఊరురా చెరువుల పండుగ, 9న తెలంగాణ సంక్షేమ సంబరాలు, 10వ తేదీన తెలంగాణ సుపరిపాలన దినోత్సవం, 11న తెలంగాణ సాహిత్య దినోత్సవం, అలాగే తెలంగాణ మహిళా సంక్షేమ దినోత్సవం, వైద్య ఆరోగ్య దినోత్సవం తదితర ఉత్సవాలపై ఆయా శాఖల అధికారులు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందుగానే ఏర్పాట్లు చేసుకోవాలని చెప్పారు. ఊరూరా చెరువుల పండుగ సందర్భంగా చెరువుల వద్ద బతుకమ్మ, బోనాలు, సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టాలని, చెరువుల వద్ద ఎలాంటి ప్రమాదం కాకుండా చేసుకోవాలన్నారు. సంక్షేమ దినోత్సవం రోజు పెన్షన్లు పొందుతున్న లబ్ధిదారులను, ఇతరులను కార్యక్రమానికి ఆహ్వానించాలని చెప్పారు. సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ సీతారామరావు, జిల్లా అధికారులు ఉన్నారు.

ఎంవీఎస్‌లో క్యాంపస్ సెలక్షన్స్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో సోమవారం నిర్వహించిన క్యాంపస్ సెలక్షన్స్‌లో 364 మంది పాల్గొనగా, 60 మంది ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ పద్మావతి ప్రకటనలో తెలిపారు. వివిధ సంస్థల ఆధ్వర్యంలో అభ్యర్థులకు రాత, మౌఖిక, ప్రాథమిక పరీక్షలు నిర్వహించినట్లు పేర్కొన్నారు.

ఆముదాల ధర రూ.5,300

దేవరకద్ర: స్థానిక మార్కెట్ యార్డులో సోమవారం జరిగిన ఈనామ్ టెండర్లలో కాముదాల ధర క్వింటాల్‌కు గరిష్టంగా రూ.5,300 నమోదు అయింది. మార్కెట్‌కు వరి ధాన్యం రాకపోవడంతో టెండర్లు వేయ లేదు. ప్రస్తుతం సీజన్ కూడా తగ్గిపోవడంతో లావాదేవీలు తగ్గుముఖం పట్టాయి.

మరోసారి ప్రజలను మభ్యపెడుతున్న బీఆర్‌ఎస్

స్టేషన్ మహబూబ్‌నగర్: ఎన్నికల సమీపిస్తున్నందున బీఆర్‌ఎస్ పార్టీ మరోసారి ప్రజలను మభ్యపెడుతున్నదని డీసీసీ అధ్యక్షుడు జి.మధుసూదన్‌రెడ్డి ఆరోపించారు. జిల్లాకేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 9 ఏళ్లు అవుతుంటే, బీఆర్‌ఎస్ ప్రభుత్వం దశాబ్ది అవతరణ దినోత్సవాలు నిర్వహిస్తుండడం విడ్డూరంగా ఉందన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో ప్రజలెవరూ పాల్గొనకపోవడంతో బలవంతంగా తరలించి కార్యక్రమం నిర్వహిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి సంక్షేమ పథకాలు తీసేస్తారని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అవగాహనా రాహిత్యంగా మాట్లాడుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ఉచిత విద్యుత్ పథకంపై మొదటి సంతకం చేశారన్న విషయాన్ని మరిచిపోకూడదన్నారు. ఆసరా పెన్షన్‌ను తీసుకొచ్చింది కాంగ్రెస్ పార్టీ అని గుర్తుచేశారు. రాహుల్‌గాంధీ ప్రకటించినట్లుగా వరంగల్ డిక్లేరేషన్ ప్రకారం రైతులకు ఏకకాలంలో రూ.2లక్షల రుణ మాఫీ చేస్తామని తెలిపారు. ప్రతి ఇంట్లో ఇద్దరికి రూ.5వేల పింఛన్ ఇస్తామని, నిరుద్యోగ యువత సంక్షేమం యూత్ డిక్లరేషన్‌ను కూడా పకడ్బందీగా అమలు చేస్తామని తెలిపారు. కార్యక్రజుమంలో నాయకులు జహీర్ అక్తర్, వసంత, సిరాజ్ ఖాద్రీ, జనార్దన్‌రెడ్డి, సాయిబాబా, అవేజ్, లక్ష్మణ్‌యాదవ్ పాల్గొన్నారు.



సారూ.. ఆలకించండి..



సిద్ధమైన నూతన కలెక్టరేట్

నేడు కందనూలుకు సీఎం కేసీఆర్



- పాలమూరు ప్రాజెక్టుపై నెరవేరని ప్రభుత్వ హామీ
- ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో పూర్తిస్థాయిలో భర్తీ కాని డాక్టర్లు, సిబ్బంది
- జిల్లాకు ప్రభుత్వ ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ కళాశాల మంజూరుపై ఆశలు

సాక్షి, నాగర్‌కర్నూల్: ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర రావు మంగళవారం కందనూలుకు రానున్నారు. సుమారు నాలుగున్నర ఏళ్ల తర్వాత సీఎం కేసీఆర్ జిల్లాకు రానుండటంతో ఆయన సందేశంపై జిల్లా వాసుల్లో ఆసక్తి నెలకొంది. ప్రధానంగా పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తి చేస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీ ఇంకా నెరవేరలేదు. సీఎం పర్యటన నేపథ్యంలో పాలమూరు ప్రాజెక్టుపై ఆశలు నెలకొన్నాయి. పనులు పూర్తిచేయడంపై కేసీఆర్ నుంచి స్పష్టమైన హామీ లభిస్తుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

జనరల్ ఆసుపత్రిలో భర్తీకాని పోస్టులు..

కందనూలుకు మెడికల్ కళాశాలతో పాటు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఏర్పాటైంది. అయితే ఇంకా పూర్తి స్థాయిలో వైద్యుల నియామకం జరగలేదు. ప్రధానంగా స్పెషాలిటీ వైద్యుల విషయంలో ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు ఇంకా భర్తీ కాలేదు. వారి స్థానాల్లో సీనియర్ రెసిడెంట్లతోనే ప్రజలకు వైద్యసేవలు అందుతున్నాయి. స్కానింగ్ విభాగంలో రేడియాలజిస్టుల నియామకం చేపట్టాల్సి ఉంది. ప్రసూతి సేవల కోసం కనీసం 12 మంది గైనకాలజిస్టులు అవసరం ఉండగా ఆస్పత్రిలో ప్రస్తుతం నలుగురే అందుబాటులో ఉన్నారు. సుమారు వెయ్యిమంది వరకు స్టాఫ్‌నర్సులను భర్తీ చేయాల్సి ఉండగా ప్రస్తుతం ఆస్పత్రిలో 56 మంది మాత్రమే సేవలందిస్తున్నారు. జనరల్ ఆస్పత్రికి పూర్తిస్థాయిలో వైద్యులు, సిబ్బందిని భర్తీ చేయాలన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నాయి. అలాగే జనరల్ ఆసుపత్రికి ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటుతో రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి సత్వర చికిత్స అందనుంది.

■ జిల్లాకేంద్రంలో ప్రభుత్వ మెడికల్, నర్సింగ్ కళాశాల మంజూరు కాగా, ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల సైతం ఏర్పాటు కావాలని జిల్లావాసులు కోరుతున్నారు. ఇంజినీరింగ్ విద్యకోసం హైదరాబాద్ వంటి ప్రాంతాలకు వెళ్లకుండా స్థానికంగా అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటుతో వృత్తి విద్యా కోర్సుల ద్వారా స్థానిక యువతకు ఉపాధి లభిస్తుంది. నిరుద్యోగ యువతకు ఉపాధి కలిగించేలా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయాలని జిల్లావాసులు కోరుతున్నారు.



ఎస్పీ కార్యాలయం

సీఎం పర్యటన ఇలా..

సీఎం కేసీఆర్ ఆదివారం సాయంత్రం జిల్లా కేంద్రానికి రానున్నారు. హైదరాబాద్ నుంచి హెలికాప్టర్ ద్వారా బయలుదేరనున్న సీఎం సుమారు 3.30 గంటలకు నూతన కలెక్టరేట్ భవనంలో హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు. అక్కడి నుంచి ముందుగా బీఆర్‌ఎస్ కార్యాలయం వద్దకు చేరుకుంటారు. పార్టీ జిల్లా కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం ఎస్పీ కార్యాలయానికి చేరుకుని నూతన భవనాన్ని ప్రారంభిస్తారు. తర్వాత నూతన కలెక్టరేట్ భవనాన్ని ప్రారంభించి అధికారులతో మాట్లాడుతారు. ఇక్కడి నుంచే మెడికల్ కళాశాల విద్యార్థుల హాస్టల్ భవనాల పనులను ప్రారంభిస్తారు. బీఆర్‌ఎస్ కార్యాలయం, ఎస్పీ కార్యాలయం వద్ద సుమారు 15 నుంచి 20 నిమిషాల చొప్పున సమయం గడుపనున్నట్టు తెలుస్తోంది. నూతన కలెక్టరేట్‌లో సుమారు 40 నిమిషాల పాటు గడిపిన అనంతరం సాయంత్రం పద్మనాయక ఫంక్షన్‌హాలు పక్కన నిర్వహించనున్న బీఆర్‌ఎస్ బహిరంగ సభలో మాట్లాడుతారు. సభ ముగిసిన అనంతరం హెలికాప్టర్ లేదా రోడ్డు మార్గంలో హైదరాబాద్‌కు బయలుదేరనున్నారు.

వరాల జల్లు కురిసేనా?

సీఎం కేసీఆర్ పర్యటన నేపథ్యంలో జిల్లాకు వరాలు కురిపించే అవకాశం ఉంది. ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటుకు మంజూరుతో పాటు జిల్లాలోని గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలకు అదనంగా నిధులు కేటాయించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. జిల్లాలో చేపట్టనున్న ఉమామహేశ్వర, చెన్నకేశవ ఎత్తిపోతల పథకాలకు నిధుల మంజూరులో సీఎం స్పష్టతనివ్వనున్నారని సమాచారం. మార్కండేయ ఎత్తిపోతల పథకం కింద భూసేకరణ, పనులు పూర్తిచేసేందుకు అవసరమైన నిధులతో పాటు జిల్లాకేంద్రంలో అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులను కేటాయిస్తారని జిల్లా నేతలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

లక్షన్నర మందితో బహిరంగసభ

ముఖ్యమంత్రి కేసీఆర్ పర్యటన నేపథ్యంలో జిల్లాకేంద్రంలోని పద్మనాయక ఫంక్షన్ హాలు సమీపంలో బీఆర్‌ఎస్ భారీ బహిరంగసభను నిర్వహించనుంది. మంగళవారం సాయంత్రం 4 గంటలకు ప్రారంభమయ్యే ఈ సభకు 1.50 లక్షలకు పైగా జనాన్ని సమీకించేలా ఏర్పాట్లు పూర్తి చేశారు. నాగర్‌కర్నూల్ నియోజకవర్గంతో పాటు అచ్చంపేట, కొల్లాపూర్, కల్వకుర్తి నియోజకవర్గాల నుంచి సైతం భారీసంఖ్యలో జనసమీకణ చేసేలా జిల్లా ఎమ్మెల్యేలు దృష్టి సారించారు. సభాప్రాంగణం, సమావేశ ఏర్పాట్లను ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎన్నికలకు ముందు సీఎం కేసీఆర్ బహిరంగసభను పూర్తిస్థాయిలో విజయవంతం చేసేలా బీఆర్‌ఎస్ శ్రేణులు ఏర్పాట్లలో తలమునకలయ్యాయి.

రాబోయేది ప్రజా ప్రభుత్వమే..

- సీఎల్పీ నేత భట్టి విక్రమార్క



ఐనోల్‌లో కాంగ్రెస్ జెండాను ఆవిష్కరిస్తున్న సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క

అచ్చంపేట: తెలంగాణలో దొరల ప్రభుత్వం వద్దని.. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించి ప్రజా ప్రభుత్వం తెచ్చుకోవడానికి ప్రజలు సిద్ధమవుతున్నారని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క అన్నారు. కాంగ్రెస్ పార్టీని బంగాళాఖాతంలో కలపడం కేసీఆర్ నీ వల్ల కాదు కాదా..నీకే మూడు చెరువుల నీళ్లు తాపి మూడు నెలల్లో బంగాళాఖాతంలో ముంచుతామని, ఇక కాస్కో ఖబడ్దార్ అని సవాల్ విసిరారు. భట్టి చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర సోమవారం అచ్చంపేట మండలంలోని చేదురుబావి తండా నుంచి ప్రారంభమై కొర్రతండా, ఐనోలు, శివారుతండా, బొమ్మనపల్లి మీదుగా లక్ష్మీదేవిగండి, సిద్దాపూర్ గ్రామాల వరకు కొనసాగింది. ఈ సందర్భంగా భట్టి లంబాడ మహిళలతో కలిసి నృత్యం చేశారు. కొర్రతండాలో గిరిజనుల ఆరాధ్య దైవమైన ముత్యాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అలాగే ఐనోలు, బొమ్మనపల్లి, సిద్దాపూర్ గ్రామాల్లో పార్టీ జెండాలను ఆవిష్కరించారు. బొమ్మనపల్లిలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో తెలంగాణ ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేరలేదని విమర్శించారు. రుణమాఫీ కాలేదని రైతులు, ఇళ్లు, పింఛన్లు రాలేదని పేదలు, కొలువులు రాలేదని నిరుద్యోగులు బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారన్నారు. కొర్రతండాలో ఇళ్లకు మీటర్లు బిగించకపోయినా అడ్డగోలుగా కరెంటు బిల్లులు వేసి దోపిడీ చేస్తున్న ఈ ప్రభుత్వానికి బుద్ధి చెప్పడానికి ఊరే సిద్ధమైందన్నారు. వారం రోజులుగా నియోజకవర్గంలో కదం తొక్కుతున్న ప్రజల ఉత్సాహాన్ని చూస్తుంటే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి భారీ మెజార్టీతో గెలవడం ఖాయం అన్న సంకేతాలు కనిపిస్తున్నాయన్నారు. రాష్ట్రంలో బ్రిటిష్ రాజ్యం సాగుతుందని, ప్రభుత్వ యంత్రాంగంతో ప్రజలను అణచివేతకు గురిస్తోందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లురవి అన్నారు. మంగళవారం జిల్లాలో ప్రారంభమవుతున్న కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాల వల్ల ధరణి సమస్య పోతుందా.. నిరుద్యో గ భృతి, ఉద్యోగాలు, డబుల్ బెడ్‌రూం ఇళ్లు వస్తా యా అని ప్రశ్నించారు. ఏసీ గదుల్లో ఉండి సీఎం ఇచ్చే ఆర్డర్ అమలు చేయడానికి ఈ భవనాలు ఉపయోగపడతాయి తప్ప ప్రజలకు మేలు జరగదన్నారు.

అందరిపై పర్యావరణ పరిరక్షణ బాధ్యత: కలెక్టర్



ఫతేపూర్ మైసమ్మ పరిసరాల్లో ప్లాస్టిక్‌ను ఏరివేస్తున్న కలెక్టర్ రవినాయక్, తదితరులు

పాలమూరు: పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కలెక్టర్ జి.రవి నాయక్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జిల్లా అటవీశాఖ ఆధ్వర్యంలో సోమవారం ఫతేపూర్ మైసమ్మ దగ్గర ఏర్పాటు చేసిన ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. దేవాలయం ప్రాంగణంలో ఉన్న ప్లాస్టిక్ వ్యర్థ పదార్థాలను ఏరివేశారు. కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ఎన్నో కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని, అయినప్పటికీ రోజురోజుకు వినియోగం పెరిగిపోతున్న దృష్ట్యా ప్లాస్టిక్‌ను నిషేధించాలన్న నినాదంతో ఈ ఏడాది పర్యావరణ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు. ప్లాస్టిక్ వినియోగం తగ్గించడంతో పాటు, ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించడం, వాడిన ప్లాస్టిక్‌ను రీసైకిల్ చేయడం వంటివి ప్రతి ఒక్కరూ పాటించాల్సిన అవసరం ఉందన్నారు. అదనపు కలెక్టర్ సీతారామారావు, ఏఎస్పీ రాములు, అటవీ శాఖ అధికారి సత్యనారాయణ, పశు సంవర్ధశాఖ అధికారి మధుసూదన్‌గౌడ్, డీపీఓ వెంకటేశ్వర్లు, డీఆర్‌డీఓ యాదయ్య, డీపీఆర్‌ఓ వెంకటేశ్వర్లు, సీపీఓ దశరథం, ఫారెస్ట్ రేంజ్ అధికారులు చంద్రయ్య పాల్గొన్నారు.

విద్యుత్ విజయాలు దేశానికే ఆదర్శం



మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు చిత్రపటాన్ని అందజేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

- ఉద్యోగుల కృషి వల్లే విద్యుత్ రంగం అభివృద్ధి
- రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): తెలంగాణ విద్యుత్ రంగంలో సాధించిన విజయాలు దేశానికి ఆదర్శమని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా సోమవారం శిల్పారామంలో తెలంగాణ విద్యుత్ విజయోత్సవం సంబరాలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి శ్రీనివాస్‌గౌడ్ హాజరై మొదట విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ తెలంగాణ విజయాలకు గుర్తుగా 22 రోజుల పండుగను చేసుకుంటున్నట్లు పేర్కొన్నారు. దేశంలో రైతులకు నిరంతరం నాణ్యమైన ఉచిత విద్యుత్ అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమేనన్నారు. సీఎం కేసీఆర్ మార్గనిర్దేశంలో మన విద్యుత్ ఉద్యోగులు ఎంతో కష్టపడి కరెంటు కష్టాలను తీర్చారని తెలిపారు. సమైక్య రాష్ట్రంలో మనిషి ఎత్తులో ఉన్న కరెంటు వైర్లు తగిలి ఎందరో రైతులు ప్రాణాలు కోల్పోయారని గుర్తు చేశారు. కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణంతో పాటు ట్రాన్స్‌ఫార్మర్లు, నూతన విద్యుత్ లైన్లు వేయడం వల్ల విద్యుత్ ప్రమాదాలను అరికట్టే అవకాశం లభించిందని, లో వోల్టేజీ సమస్య తీయడంతో పాటు నిరంతర విద్యుత్ సరఫరాకు అవకాశం ఏర్పడిందన్నారు. తెలంగాణ ఏర్పడిన కేవలం రెండేళ్లలోనే విద్యుత్ రంగంలో మనం విజయం సాధించామన్నారు. విద్యుత్ విజయానికి గుర్తుగా ఆ శాఖ ఉద్యోగులకు మిగతా శాఖలతో పోలిస్తే అత్యధిక వేతనాలను అందిస్తున్నామన్నారు. ఒక ఐఏఎస్ అధికారి కంటే సీనియర్ లైన్‌మేన్‌కు ఎక్కువ వేతనం వస్తుందని తెలిపారు. విధి నిర్వహణలో చక్కని ప్రతిభ కనబరిచిన పలువురు విద్యుత్ ఉద్యోగులను మంత్రి ఈ సందర్భంగా సన్మానించారు. అంతకు ముందు విద్యుత్‌శాఖ సాధించిన ప్రగతి నివేదికను విడుదల చేశారు. అనంతరం మంత్రి చిత్రపటాన్ని ఏఈ సోమశేఖర్ అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్ రెడ్డి, కలెక్టర్ రవినాయక్, ముడా చైర్మన్ గంజి వెంకన్న, మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, ట్రాన్స్‌కో ఎస్ఈ శ్రీరామూర్తి, డీఈ చంద్రమౌళి, ఏఎస్‌ఓ ఎస్‌ఏఓ శ్రీకాంత్, ఏడీ అనంతయ్య, 1104 విద్యుత్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సాయిబాబు, నాయకులు విజయ్‌కుమార్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల సమ్మెబాట

- కమీషన్ అద్దెకు, కరెంట్ బిల్లులకు సరిపోవడం లేదని ఆవేదన
- జిల్లాలో మూతపడ్డ 506 చౌకధర దుకాణాలు

మహబూబ్‌నగర్ రూరల్: రేషన్ డీలర్లు తమ డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ సమ్మెబాట పట్టారు. జిల్లావ్యాప్తంగా ఉన్న 506 చౌకధర దుకాణాలు శనివారం నుంచి మూతపడ్డాయి. డీలర్లకు సంబంధించిన 20 సమస్యలు పరిష్కరించాలని, గౌరవ వేతనం, కమీషన్ పెంచాలని కోరగా, గత నెల 22న రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ రాష్ట్ర నాయకులతో సమావేశమై సమస్యలు పరిష్కరిస్తామని ప్రకటించారు. గౌరవ వేతనం, కమీషన్ పెంపు ముఖ్యమంత్రి పరిధిలో ఉంటుందని తెలియజేయడంతో రాష్ట్ర నాయకులు సమ్మెను విరమిస్తున్నట్లు ప్రకటించారు. ఆ తర్వాత జూన్ 2 నుంచి జిల్లా వ్యాప్తంగా రేషన్ డీలర్లు ఆకస్మికంగా సమ్మెలోకి వెళ్లడంతో అధికారులు ఆశ్చర్యపోయారు.



మహబూబ్‌నగర్‌లో మూతపడ్డ చౌకధర దుకాణం

తెరుచుకోని దుకాణాలు

గత నెల 28న రైస్ ఇండెంట్ రావడంతో ఈనెల 3వ తేదీ నుంచే బియ్యం పంపిణీ చేయడానికి ఆన్‌లైన్ ప్రారంభమైంది. 2వ తేదీ సాయంత్రం నుంచి డీలర్లు సమ్మెలోకి వెళ్లారు. శనివారం జిల్లా వ్యాప్తంగా చౌకధర దుకాణాలు తెరుచుకోలేదు. సాధారణంగా ప్రతినెల 4వ తేదీ నుంచి బియ్యం పంపిణీ చేస్తారు. ఇండెంట్ ముందే రావడంతో ఒకరోజు ముందస్తుగా అధికారులు ఆన్‌లైన్ ప్రారంభించారు. ఈ-పాస్ యంత్రాల ద్వారా బియ్యం పంపిణీకి ఆన్‌లైన్ ద్వారాలు తెరిచారు. సమ్మె ముగిసిందనే భావనలో అధికారులు ఉండగా, మరోవైపు డీలర్ల నిర్ణయంతో అధికారులు ఆశ్చర్యానికి గురయ్యారు. బియ్యం పంపిణీ ఎక్కడికక్కడ నిలిచిపోయింది.

అరకొర కమీషన్..

జాతీయ ఆహార భద్రత చట్టం 2015 అమల్లోకి రాకముందు రేషన్ బియ్యం కిలోకు 20పైసల చొప్పున క్వింటాల్‌కు కమీషన్ వచ్చేది. జాతీయ ఆహార భద్రత చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత ఈ కమీషన్ 70పైసలకి పెరిగింది. ఇందులో కేంద్రం 35, రాష్ట్రం 35పైసల చొప్పున చెల్లించాల్సి ఉంది. ప్రస్తుతం 22.50పైసలు కమీషన్ మాత్రమే వస్తుంది. ఆ కమీషన్ సరిపోక అద్దె, కరెంట్ బిల్లులు ఇతరాత్ర వాటిని చెల్లించేందుకు డీలర్లు నానా తంటాలు పడుతున్నారు.

దీర్ఘకాలిక సమస్యలు

రాష్ట్ర వ్యాప్తంగా డీలర్లు 2021లో సమ్మె నోటీస్ ఇచ్చారు. గౌరవ వేతనం కావాలని పోరాటం చేశారు. డీలర్లకు రూ.10 లక్షల బీమా కల్పించాలని, హమాలీ చార్జీలను ప్రభుత్వమే చెల్లించాలని, మండలస్థాయి స్టాయింట్లలో వే బ్రిడ్జ్‌లు ఏర్పాటు చేయాలని, శాశ్వత అథరైజేషన్ ఇవ్వాలని, కారుణ్య నియామకాలు 50 ఏళ్లకు పెంచాలని, నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని ఇలా 20 డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం దీనికి స్పందించి మంత్రులతో సబ్ కమిటీని ఏర్పాటు చేసింది. సమస్యలు పరిష్కారం కాకపోవడంతో మరోమారు సమ్మెబాట పట్టారు.

జిల్లాలో ఇలా...	చౌకధర దుకాణాలు	ఆహార భద్రత కార్డులు	అన్నపూర్ణ కార్డులు
	506	2,20,644	205



అంత్యోదయ కార్డులు	ప్రతినెల పంపిణీ చేసే బియ్యం
18,887	4393.390 (ఎంటీఎస్)

గౌరవ వేతనం చెల్లించాలి



ప్రస్తుతం ఇస్తున్న కమీషన్ల స్థానంలో కనీస గౌరవ వేతనం రూ.30 వేలు ప్రకటించాలి. కొన్నేళ్లుగా సమస్యలపై ఆందోళనలు చేస్తున్నాం. వచ్చే కమీషన్ సరిపోక ఆర్థిక ఇబ్బందులతో నానా తంటాలు పడుతున్నాం. ప్రతి ఇంటికి రేషన్ సరుకులను అందిస్తూ బాధ్యతాయుతంగా పనిచేస్తున్న డీలర్లను ప్రభుత్వం గుర్తించాలి. బియ్యంతో పాటు పలు సరుకులు పంపిణీ చేయాలి.

– శ్యామ్‌సుందర్‌యాదవ్, రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు

డిమాండ్లు నెరవేర్చాలి



దీర్ఘకాలిక డిమాండ్లను నెరవేర్చే వరకు సమ్మె విరమించం. ఏళ్లుగా ఆందోళనలు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదు. గౌరవంగా బతకడానికి రేషన్ డీలర్లకు వేతనం ఇవ్వాలి. సీఎం కేసీఆర్ ఎన్నో సభలలో ఇస్తామని ప్రకటించారు. తొమ్మిదేళ్లు అవుతున్నా ఆ హామీ నెరవేరలేదు. ప్రజలకు అసౌకర్యం కలిగితే దానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి.

– లక్ష్మణ్, మండల అధ్యక్షుడు, మహ్మదాబాద్

ఆర్తనాదాలు.. విషాదఛాయలు

- ఈతకు వెళ్లి నలుగురు మృతిచెందడంతో తల్లడిల్లిన కుటుంబీకులు

ఎర్రవల్లి చౌరస్తా/ మానవపాడు/ శాంతినగర్: సరదాగా ఈతకు వెళ్లి నలుగురు మృతిచెందిన ఘటనతో మూడు గ్రామాల్లో విషాదఛాయలు అలుముకోగా.. కుటుంబ సభ్యుల ఆర్తనాదాలతో ఆయా ప్రాంతాలన్నీ మారుమోగాయి. ఇటిక్యాల మండలంలోని వల్లూరుకు చెందిన అన్నదమ్ములు ఇస్మాయిల్, ఇబ్రహింలు బతుకుదెరువు కోసం 20 ఏళ్ల క్రితం ఏపీలోని కర్నూలుకు వలస వెళ్లారు. వేసవిసెలవుల కావడంతో కుటుంబసభ్యులతో కలిసి మానవపాడు మండలంలోని బోరవెల్లిలో బంధువుల ఇంటికి నాలుగు రోజుల క్రితం వచ్చారు. ఈ క్రమంలో సోమవారం మధ్యాహ్నం పల్లెపాడు శివారులోని కృష్ణానదిలో ఈతకు వెళ్లి సమీర్, రియాన్, ఆఫ్రిన్, నవసీన్ మృతిచెందడంతో పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విగత జీవులుగా పడి ఉన్న వారిని చూసి కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదించారు. విషయం తెలుసుకున్న జెడ్పీ చైర్‌పర్సన్ సరిత ఆస్పత్రికి చేరుకుని బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని బీఎస్పీ అలంపూర్ నియోజకవర్గ అధ్యక్షుడు మహేష్ కోరారు. ఈ ఘటనతో ఇటిక్యాల మండలంలోని వల్లూరుతోపాటు కర్నూలు, మానవపాడు మండలంలోని బోరవెల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి. అలాగే రామాపురం గ్రామానికి చెందిన ఆడపడుచు మున్నీ కూతుళ్లు కృష్ణానదిలో మునిగి మృతిచెందడంతో గ్రామంలో విషాదం అలుముకుంది. ఇదిలా ఉండగా కానిస్టేబుల్ పాలాక్షిరెడ్డి యువకుడి మృతదేహాన్ని భుజాలపై మోసుకుంటూ వాహనం తీసుకెళ్లడం చూసి స్థానికులు మానవత్వం చాటాడని చర్చించుకున్నారు.



ఆస్పత్రి వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

క్లుప్తంగా

పుట్టిన రోజే తనువు చాలించాడు


చరణ్ (ఫైల్)

దామరగిద్ద: పుట్టిన రోజునే ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడి తనువు చాలించిన విషాదకర సంఘటన సోమవారం మండలంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని మద్దెల్‌బీడ్‌కు చెందన చరణ్(30) కొంతకాలంగా మానసిక అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో జీవితంపై విరక్తి పెంచుకొని తరచుగా స్నేహితులతో బాధపడేవాడు. ఈ క్రమంలో ఆదివారం ఏరువాక పండుగ కోసం భార్య ఊరికి వెళ్లడంతో సోమవారం ఉదయం తమ పొలం సమీపంలో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. చుట్టుపక్కల పొలాల రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అప్పటికే మృతిచెందడంతో అంత్యక్రియలు నిర్వహించారు. చరణ్‌కు భార్యతోపాటు ఓ కూతురు ఉన్నారు.

క్షణికావేశంలో వ్యక్తి ఆత్మహత్య

పాన్‌గల్: క్షణికావేశంలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ సంఘటన సోమవారం మండలంలోని రేమద్దుల గ్రామంలో చోటుచేసుకుంది. హెచ్‌సీ రాంచందర్ తెలిపిన వివరాలు.. రేమద్దులకు చెందిన పసుపుల ప్రతాప్(34), ఆయన భార్య ఆదివారం రాత్రి సంసారం విషయంలో గొడవపడ్డారు. ఈ క్రమంలోనే క్షణికావేశానికి లోనై ఇంట్లోని ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకున్నాడు. కుటుంబ సభ్యులు సోమవారం ఉదయం గమనించారు. కానీ అప్పటికే మృతిచెందాడు. మృతుని తల్లి గోవిందమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని హెచ్‌సీ పేర్కొన్నారు.

గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లా కేంద్రంలోని కేసరిసముద్రం చెరువులో గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యమైన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కేసరి సముద్రం చెరువులో గుర్తుతెలియని మహిళ మృతదేహం నీటిపై తేలియాడుతుండటం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని చెరువు నుంచి బయటకు తీసి జనరల్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతదేహాన్ని ఎవరైన గుర్తుపడితే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

రెగ్యులర్ చేయాలని వినతి



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పీయూలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలని కోరుతూ వీసీ లక్ష్మీకాంత్ రాథోడ్‌కు కాంట్రాక్టు అధ్యాపకులు సోమవారం వినతిపత్రం అందజేశారు. యూనివర్సిటీ ప్రారంభం నుంచి ఇక్కడే విధులు నిర్వహిస్తున్న వారికి ఉద్యోగ భద్రత లేకుండా పోయిందన్నారు. గతంలో ప్రభుత్వం తమకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుని భరోసా కల్పించాలని, తమ డిమాండ్లను నెరవేర్చే వరకు వివిధ రూపాల్లో నిరసన తెలుపుతామన్నారు. అనంతరం పీయూలో బైక్ ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో పుటా అధ్యక్షుడు భూమయ్య, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ ఇన్నోవేషన్ చాలెంజ్‌కు ఎంపిక

కందనూలు: స్కూల్ ఇన్నోవేషన్ చాలెంజ్ 2022- 23 విద్యా సంవత్సరానికి సంబంధించి రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా నుంచి ఒక ప్రాజెక్టు ఎంపికైందని డీఈఓ గోవిందరాజులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత విద్యా సంవత్సరం జనవరి వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసిన 13 వేల ప్రాజెక్టుల నుంచి 70 ప్రాజెక్టులను ఫైనల్స్‌కి ఎంపిక చేయగా.. ఇందులో జిల్లా నుంచి మాధారం జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు హర్షవర్ధన్, అరవింద్, మహేష్, సిద్ధు రూపొందించిన నీటి ప్రవాహంలో ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించడం అనే ప్రాజెక్టు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. ఈ మేరకు విద్యార్థులను, గైడ్ టీచర్ శివకుమార్‌ను డీఈఓ ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీలు ఈ నెల 21, 22, 23 తేదీల్లో హైదరాబాద్‌లో ఉంటాయని జిల్లా సైన్స్ అధికారి కృష్ణారెడ్డి తెలిపారు.



వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురి దుర్మరణం

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో సోమవారం వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు దుర్మరణం పాలయ్యారు. ఆయా ఘటనలకు సంబంధించి వివరాలిలా..


కుమారస్వామి (ఫైల్)


వడ్డె పెద్దరాజు (ఫైల్)

రెండు బైక్‌లు ఢీ.. ఇద్దరు

మహబూబ్‌నగర్ క్రైం: భార్యాభర్తలు కూలీ పనులు ముగించుకొని ఇంటికి ప్రయాణమవగా.. మరో వ్యక్తి స్వగ్రామంలో బంధువుల ఇంట్లో ఫంక్షన్ పూర్తి చేసుకొని తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందగా.. మరో మహిళకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స కోసం జనరల్ ఆస్పత్రికి తరలించారు. మహబూబ్‌నగర్ రూరల్ ఎస్‌ఐ వెంకటేశ్వర్లు కథనం ప్రకారం.. కోయిలకొండ మండలం మల్కాపూర్‌కు చెందిన వడ్డె పెద్ద రాజు(46) భార్య అనంతమ్మతో కలిసి జిల్లాకేంద్రంలో కూలీ పని ముగించుకొని మోపెడ్‌పై సోమవారం సాయంత్రం 6గంటల ప్రాంతంలో స్వగ్రామానికి వెళ్తున్నాడు. ఇదే సమయంలో కోయిలకొండ మండలం అభంగపట్నంకు చెందిన కుమారస్వామి(45) బంధువుల ఇంట్లో ఫంక్షన్ పూర్తిచేసుకుని మహబూబ్‌నగర్‌కు వస్తుండగా మార్గమధ్యలో రేగడిగడ్డతండా సమీపంలో రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొట్టుకోవడంతో వడ్డె పెద్ద రాజు, కుమారస్వామి అక్కడికక్కడే మృతిచెందారు. అలాగే వడ్డె పెద్ద రాజు భార్య అనంతమ్మకు తీవ్రగాయాలు కావడంతో చికిత్స కోసం జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉంది. ఘటనా స్థలాన్ని రూరల్ పోలీసులు పరిశీలించి రెండు మృతదేహాలను జనరల్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఈ రెండు వాహనాలు వేగంగా ఉండటం వల్లే ప్రమాద తీవ్రత పెరిగి ప్రాణనష్టం జరిగింది. అయితే మృతుల్లో వడ్డె పెద్ద రాజు, భార్యతో కలిసి ప్రతి రోజు మహబూబ్‌నగర్‌కు వచ్చి దినసరి కూలీ పనులు చేస్తూ జీవనం సాగించేవారు. వీరికి నలుగురు అమ్మాయిలు ఉండగా ఒకరికి మాత్రం పెళ్లి చేశారు. అలాగే కుమారస్వామి మహబూబ్‌నగర్‌లో నివాసం ఉంటూ జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు. ఇతనికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇంటి పెద్దలు మృతి చెందడంతో ఈ రెండు కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

జాతీయ రహదారిపై ఒకరు..

మానవపాడు: జాతీయ రహదారి- 44పై రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెంది, మరొకరికి గాయాలైన సంఘటన మండలంలో సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ఎస్‌ఐ రామకృష్ణ తెలిపిన కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. నంద్యాల జిల్లాకు చెందిన పరమేశ్వరప్ప(49), శివలక్ష్మీదేవి, కారు డ్రైవర్ విజయ్‌తో కలిసి థాయిలాండ్ వెళ్లే కుమారుడు సాయితేజప్పను విమానం ఎక్కించడానికి హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో జాతీయ రహదారి బోరవెల్లి స్టేజి సమీపంలోని దయ్యాలవాగు వద్ద కిలోమీటర్ రాయిని కారు ఢీకొట్టింది. దీంతో పరమేశ్వరప్పను, ఆయన భార్య శివలక్ష్మీదేవిని హైవే అంబులెన్స్‌లో కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో పరమేశ్వరప్ప మృతిచెందాడు. మహిళను కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. డ్రైవర్ విజయ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. మృతిచెందిన పరమేశ్వరప్ప భార్య శివలక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు కేస నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ వివరించారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

నాగర్‌కర్నూల్ క్రైం: గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మండల పరిధిలోని మంతటి క్రాస్‌రోడ్డు సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. సోమవారం వెలుగులోకి వచ్చింది. ఎస్సై విజయ్‌కుమార్ తెలిపిన వివరాలు.. బల్మూరు మండలం పోలేపల్లికి చెందిన పానుగంటి బంగారయ్య (35) వనపట్ల గ్రామ శివారులోని క్రషర్ వద్ద టిప్పర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం పని ముగించుకుని ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వెళ్తుండగా మంతటి క్రాస్ రోడ్డు సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు సమాచారం మేరకు పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనకు సంబంధించి మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

యువకుడి సజీవదహనం

- బైక్‌ను ఢీకొన్న ఆటో..
- పొలంలో వ్యర్థాలకు పెట్టిన మంటల్లో పడి కాంట్రాక్ట్ ఉద్యోగి మృతి


మహేష్‌గౌడ్ (ఫైల్)

చిన్నంబావి: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా విద్యుత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమానికి వెళ్తూ రోడ్డు ప్రమాదానికి గురైన ఓ యువకుడు అదే సయమంలో మంటల్లో పడి సజీవ దహనమయ్యాడు. ఈ విషాదకర సంఘటన వనపర్తి జిల్లాలోని చిన్నంబావి మండలంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ వస్రంనాయక్ కథనం ప్రకారం.. చిన్నంబావి మండలంలోని అమ్మాయిపల్లికి చెందిన మహేష్‌గౌడ్(25) విద్యుత్ శాఖలో కాంట్రాక్ పద్ధతిలో స్పాట్ బిల్లర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం అయ్యవారిపల్లిలో కరెంట్ బిల్లులు కొట్టి కొల్లాపూర్‌లో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దశాబ్ది ఉత్సవాలకు పాల్గొనేందుకు ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. ఈ క్రమంలో చిన్నంబావి సమీపంలోని కేడీఆర్ పాఠశాల వద్ద ఎదురుగా వచ్చిన ఆటో ఢీకొట్టింది. దీంతో మహేష్‌గౌడ్ రోడ్డు పక్కన రైతు పొలంలోని వర్థ్యాలకు నిప్పు పెట్టడంతో ఆ మంటల్లో ఎగిరిపడి సజీవ దహనమయ్యాడు. ఈ ఘటనపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు. యువకుడి అకాల మరణంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం


శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

- ధాన్యం నిల్వ కోసమే గిడ్డంగుల నిర్మాణాలు
- రూ.10కోట్లు మంజూరు: మంత్రి నిరంజన్ రెడ్డి

అమరచింత: ప్రత్యేక రాష్ట్రం సిద్ధించినప్పటి నుంచి సీఎం కేసీఆర్ రైతు సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తూ, సంక్షేమ పథకాలను ప్రవేశ పెడుతున్నారని వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని ధర్మాపూర్ శివారులో రూ.10కోట్ల వ్యయంతో నిర్మించనున్న గిడ్డంగుల కోసం సోమవారం శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే చిట్టెం రాంమోహన్ రెడ్డి, గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ సాయిచంద్‌తో కలిసి పాల్గొన్నారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ స్వరాష్ట్రం వచ్చిన తక్షణమే రైతులకు సాగునీరు అందించడానికి నిరంతరం కృషి చేశామని, పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు మంజూరు చేస్తూ ప్రతి ఎకరానికి సాగునీటిని అందిస్తున్న ప్రభుత్వం తమదేనన్నారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని భద్రపర్చడానికి గోదాంల నిర్మాణాలను చేపట్టామన్నారు. ఇందులో భాగంగానే అమరచింత మండలానికి పదివేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గిడ్డంగులను నిర్మించనున్నామని తెలిపారు.

నాలుగు నెలలో పనులు పూర్తి..

వచ్చే నాలుగు నెలల్లో నూతనంగా నిర్మించే గిడ్డంగుల పనులను పూర్తి చేయడానికి ప్రణాళిక సిద్ధం చేశామని రాష్ట్ర గిడ్డంగుల శాఖ చైర్మన్ సాయిచంద్ అన్నారు. తమ సొంత మండలానికి గిడ్డంగి మంజూరు కావడం సంతోషంగా ఉందన్నారు. సీఎం కేసీఆర్ రైతు పక్షపాతి, అని రైతు సంక్షేమంతో పాటు అన్ని వర్గాల అభ్యున్నతి కోసం ఎన్నో సంక్షేమ పథకాలను తెచ్చి తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే ఆదర్శవంతమైన రాష్ట్రంగా తీర్చిదిద్దారన్నారు. కార్యక్రమంలో గిడ్డంగుల శాఖ ఎండి.జితేందర్ రెడ్డి, ఎస్‌ఈ రామకృష్ణమూర్తి, డీఈ శ్రీనివాస్, ఎంపీపీ డాక్టర్ చుక్కమాలతి, వైస్ ఎంపీపీ బాల్‌రెడ్డి, జెడ్పీటీసీ మార్కసరోజ, మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, మార్కెట్ చైర్మన్ ఎస్‌ఏ.రాజు, బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు రమేష్, నాయకులు ఆశిరెడ్డి, సర్పంచ్ సర్వారెడ్డి, ఎంపీడీఓ జ్యోతి, తహసీల్దార్ చాంద్‌పాషా పాల్గొన్నారు.

మంత్రికి మాదాసి కురువల వినతి..

ఈ సందర్భంగా మంత్రి నిరంజన్ రెడ్డికి మాదాసి కురువ, మాదాసి కురుమ సంఘం రాష్ట్ర నాయకులు కలిసి తమకు ఎస్సీ ధ్రువపత్రాల మంజూరుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో బాలరాజ్, వెంకటయ్య ఉన్నారు.

దేశానికే అన్నం పెట్టే స్థాయికి తెలంగాణ


ఎల్కిచర్లలో సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధారక్‌రెడ్డి, కలెక్టర్ రవినాయక్

- బీజేపీ, కాంగ్రెస్ వాళ్లు అడ్డుకున్నందుకే 'పాలమూరు' ఆలస్యం
- మంత్రి శ్రీనివాస్‌గౌడ్

భూత్పూర్: తెలంగాణ ఏర్పడితే చీకటి బతుకులు అన్న మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి చీకటిలో కలిసిపోయాడని, నేడు 24 గంటల విద్యుత్‌తో రాష్ట్రం పండించిన పంటలు దేశ ప్రజలందరికీ అన్నం పెట్టే స్థాయికి ఎదిగిందని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. సోమవారం మండలంలోని ఎల్కిచర్ల సమీపంలో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, కలెక్టర్ రవినాయక్ ట్రాన్స్‌కో ఎస్‌ఈ మూర్తితో కలిసి ప్రారంభించారు. రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా విద్యుత్ ప్రగతి కార్యక్రమంలో భాగంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రం రాక ముందు హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్‌లో రైతులు కరెంట్ కోసం ధర్నా చేస్తే రైతులపై కాల్పులు జరిపి ప్రాణాలు తీశారని, బీజేపీ, కాంగ్రెస్ పాలిత ప్రాంతాలల్లో తెలంగాణలో కరెంట్ సరఫరా చేసినట్లు ఇస్తున్నారా? అని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ప్రశ్నించారు. బీజేపీ ప్రభుత్వం రైతుల పొలాల వద్ద కరెంట్ మీటర్ పెట్టాలని యోచనలో ఉన్నారని, రాష్ట్రంలో ఒక్క రైతు పొలానికి మీటర్ బిగించే ప్రసక్తే లేదని మంత్రి భరోసా కల్పించారు. సీఎం కేసీఆర్ బాధ్యతలు చేపట్టిన కొద్ది నెలలకే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు శంకుస్థాపన చేశారని, త్వరలో కాల్వల ద్వారా కర్వెన ప్రాజెక్టును నీటితో నింపుతామని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు అడ్డుకోవడం వల్లే ప్రాజెక్ట్ ఆలస్యమైందన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ నేడు విద్యుత్ వినియోగం పెరిగిందని, రాష్ట్రం వచ్చాక గ్రామాలల్లో విద్యుత్ సరఫరా మెరుగుపడిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ శేఖర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ నరేష్ గౌడ్, మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్‌గౌడ్, మత్స్య సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, విండో చైర్మన్ అశోక్‌రెడ్డి, సర్పంచ్ పద్మ, తహసీల్దార్ చెన్నకిష్టన్న, ఎంపీడీఓ మున్ని పాల్గొన్నారు.

శ్రీశైలంలో నీటిమట్టం 809.6 అడుగులు

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో సోమవారం నీటిమట్టం 809.6 అడుగులు, 34.1004 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ఇరవై నాలుగు గంటల వ్యవధిలో రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్‌ఐకు నీటి విడుదల కొనసాగలేదు. శ్రీశైలం జలాశయంలో 229 క్యూసెక్కుల నీరు ఆవిరైంది.

పరిశుభ్రతలో 5వ ర్యాంకు



కల్వకుర్తి టౌన్: ఆస్పత్రుల శుభ్రతపై కేంద్ర ప్రభుత్వం అందించే కాయకల్ప అవార్డులో కల్వకుర్తి కమ్యూనిటీ ఆస్పత్రికి రాష్ట్రస్థాయిలో 5వ ర్యాంకు లభించిందని సూపరింటెండెంట్ శివరాం సోమవారం తెలిపారు. ఈ ఏడాది మార్చిలో కేంద్ర బృందం సభ్యులు నారాయణరెడ్డి ఆధ్వర్యంలో పరిశీలనకు వచ్చారు. వారు అందజేసిన నివేదిక ప్రకారం సోమవారం వెలువరించిన ఫలితాల్లో ఆస్పత్రికి 84.5 మార్కులతో సీహెచ్‌సీ కేటగిరీలో ఉమ్మడి జిల్లాలో ప్రథమస్థానం లభించిందన్నారు. అవార్డుకు ఎంపికైనందుకు గాను మూడేళ్లపాటు ఆస్పత్రి శుభ్రత కోసం రూ.లక్ష అందనుంది. కాయకల్ప అవార్డుకు ఆస్పత్రి ఎంపికపై శివరాం సిబ్బందిని అభినందించారు. ఇదే స్ఫూర్తితో మరిన్ని అవార్డులు పొందేందుకు ముందుకెళ్తామని పేర్కొన్నారు.

ప్లాస్టిక్ నియంత్రణ అత్యవసరం

- జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి సంధ్యారాణి



మొక్కలు నాటుతున్న జడ్జి సంధ్యారాణి

మహబూబ్‌నగర్ రూరల్: భావితరాల భవిష్యత్ కోసం ప్లాస్టిక్ నివారణ అత్యవసరమని జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి సంధ్యారాణి పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర న్యాయసేవ అధికార సంస్థ ఆదేశాల మేరకు సోమవారం ఐసీడీఎస్ ప్రాంగణంలోని జువైనల్ జస్టిస్ బోర్డు కార్యాలయం వద్ద మొక్కలు నాటారు. జడ్జి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ నివారణకు యుద్ధప్రాతిపదికన కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. యువత పర్యావరణ పరిరక్షణలో భాగస్వామ్యం కావాలని, సమాజాన్ని చైతన్యం చేసే విధంగా ఆలోచించాలని సూచించారు. ప్లాస్టిక్ వాడకం వల్ల భూమి కలుషితం కావడంతో పాటు భూగర్భ జలాలు అడుగంటిపోయే ప్రమాదం ఉందన్నారు. విరివిగా మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని సూచించారు. ప్రతి కుటుంబం నిత్యవసర సరుకులకు, కూరగాయలకు ప్లాస్టిక్ కవర్లు వాడకుండా జూట్, పేపరు బ్యాగులను వాడాలని సూచించారు. కార్యక్రమంలో రెండవ అదనపు జడ్జి రాజపూడి శ్రీదేవి, ఫ్యామిలీ కోర్టు జడ్జి ఎస్‌పీవీ చంద్రకళ, ప్రత్యేక కోర్టు జడ్జి పద్మ, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కమ్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి ఎంకే పద్మావతి, అదనపు సీనియర్ సివిల్ జడ్జి చిరంజీ ఆశలత, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి సూరంపుడి శ్రీదేవి, ఎక్సైజ్, కోర్టు జడ్జి హరికుమార్, మూడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి నిహారిక, మనోహర్, న్యాయవాదులు పాల్గొన్నారు.

సంగంబండ కెనాల్ మరమ్మతు ప్రారంభం


కాల్వ మరమ్మతు పనులు ప్రారంభిస్తున్న నేరడగం సర్పంచ్ అశోక్‌గౌడ్, తిప్పయ్య

మాగనూర్: మండల పరిధిలోని నేరడగం గ్రామసమీపంలోని జీరో పాయింట్ వద్ద సోమవారం మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు సర్పంచ్ అశోక్‌గౌడ్ ఆధ్వర్యంలో సంగంబండ నర్సిరెడ్డి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ లోలెవల్ కుడి లోలెవల్ కెనాల్ మరమ్మతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ముందస్తుగా కాల్వ మరమ్మతు చేసి రైతులకు మేలు చేసేందుకు ఎమ్మెల్యే ముందుచూపుతో పనులు ప్రారంభించారని అన్నారు. ఇంతటి కృషిచేస్తున్న ఎమ్మెల్యేకు రైతులు ఎప్పటికి రుణపడి ఉంటారని అన్నారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ తిప్పయ్య, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు మల్‌రెడ్డి, ఏఈ బాలరాం, డీఈ సురేష్, మారెప్ప, కేశవరెడ్డి, సాయన్న, వెంకటప్ప, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి హామీ పథకాన్ని ఎత్తేసే కుట్ర'


కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఉపాధి కూలీలు, నాయకులు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): జాతీయ ఉపాధి హామీ పథకాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎత్తివేసే కుట్ర చేస్తుందని ఉపాధి హామీ పరిరక్షణ సమితి నాయకులు ఆరోపించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్ మాట్లాడుతూ.. పని హక్కులను కాలరాయడం తగదని, బడ్జెట్‌లో పథకానికి నిధులు కోత విధించడం దుర్మార్గమన్నారు. ఉపాధి హామీ చట్ట పరిరక్షణకు ఐక్య ఉద్యమం చేపట్టాలన్నారు. 8 ఏళ్లుగా కేంద్ర బడ్జెట్‌లో నిధులను తగ్గిస్తూ పథకాన్ని నీరుగారుస్తున్నారని విమర్శించారు. దేశవ్యాప్తంగా 20 కోట్ల మంది దళితులు, 18 కోట్ల మంది గిరిజనులు ఉపాధి హామీ పని వల్ల ఆత్మగౌరవంతో బతకడాన్ని బీజేపీ జీర్ణించుకోవడం లేదని ఆరోపించారు. పనిదినాలను క్రమంగా తగ్గిస్తూ గ్రామాల్లో నిరుపేదలకు పనులు లేకుండా చేస్తుందన్నారు. కూలీలు చేసిన పనికి 6నెలల నుంచి వేతనాలు చెల్లించడం లేదన్నారు. మోదీ ప్రభుత్వం గతేడాది కేటాయించిన రూ.73వేల కోట్ల బడ్జెట్ నుంచి రూ.63వేల కోట్లకు కుదించిందన్నారు. కూలీల పని దినాలను తగ్గించడం కోసం కొత్త విధానాలను తీసుకువస్తుందన్నారు. కూలీల జాబ్ కార్డు, ఆధార్, బ్యాంక్ అకౌంట్, ఫోన్ నంబర్లను లింకు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించిందన్నారు. కార్యక్రమంలో వెంకటయ్య, జగన్, జంబులయ్య, వెంకటేశ్వరమ్మ, రవి, నాగన్న, వెంకటమ్మ, సాయిలు, జయరాములు, రామచంద్రమ్మ, యాదమ్మ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

- అసోసియేట్ డీన్ డా. పిడిగం సైదయ్య


విద్యార్థికి బహుమతి అందజేస్తున్న అసోసియేట్ ప్రొఫెసర్ డా. సైదయ్య

వనపర్తి: రోజురోజుకు పెరుగుతున్న పర్యావరణ కాలుష్యంతో భూతాపం సాధారణ స్థితిని మించిపోతోందని.. పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మోజర్ల ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డా. పిడిగం సైదయ్య అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సోమవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉష్ణోగ్రతలు పెరిగితే ప్రళయాలు, వేడిగాలులు, కరువులు, క్షామం ఏర్పడతాయన్నారు. ఒక చెట్టు ఏడాదికి 100 కిలోల ఆక్సిజన్ అందిస్తుందని.. ఒక మనిషికి ఏడాదికి 770 కిలోల ఆక్సిజన్ అవసరమవుతోందని తెలిపారు. అంటే ఒక మనిషికి ఏడు నుంచి ఎనిమిది చెట్లు పచ్చని ఆకులతో ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఒక్కరు స్పందించి మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. ఉష్ణోగ్రతల హెచ్చుతగ్గులు పంట ఉత్పత్తులపై ప్రభావం చూపుతాయని.. ప్రధాన పంటలైన వరి, గోధుమ, సోయాబీన్ లాంటి పంటల్లోనూ నాణ్యత, ఉత్పత్తి దెబ్బతినే అవకాశం ఉందన్నారు. సేంద్రియ పద్ధతిని అవలంబిస్తూనే, పర్యావరణ మార్పుల నేపథ్యంలో అధిక వేడి, నీటిఎద్దడిని తట్టుకొనే పంట రకాలు సైతం రూపొందించుకోవాలని సూచించారు. దేశంలో సింగిల్ యూస్ ప్లాస్టిక్ బ్యాన్ చేయడం సంతోషకరమని.. పకడ్బందీగా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. సాధ్యమైనంత వరకు పర్యావరణహిత పదార్థాలను వాడటం అలవాటు చేసుకోవాలని కోరారు. అనంతరం విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఓఎస్‌ఏ రాజశేఖర్, సీనియర్ అధ్యాపకులు డా. షహనాజ్, నాగరాజు, చంద్రశేఖర్, గౌతమి, విద్యార్థులు పాల్గొన్నారు.

నగల కోసం ఘాతుకం

- వృద్ధురాలి దారుణ హత్య
- హయత్‌నగర్‌లో కలకలం

హయత్‌నగర్/నాగోలు: ఇంట్లోని ఒంటరి వృద్ధురాలిని దుండగులు హత్య చేసి ఆమె ఒంటిపై ఉన్న నగలను దోచుకెళ్లిన ఘటన సోమవారం హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. తొర్రూర్‌కి చెందిన సంరెడ్డి సత్యమ్మ (82) ఇంట్లో ఒంటరిగా నివసిస్తోంది. ఈ నేపథ్యంలో నారాయణపేట జిల్లా దామరగిద్దకి చెందిన ఎండ్ల రాకేష్ (28) ఏడాదిన్నర క్రితం హయత్‌నగర్ మండలంలోని తొర్రూర్‌కు వచ్చి తన సోదరుడు చంద్రశేఖర్ కొత్తగా నిర్మిస్తున్న ఇంట్లో ఉంటున్నాడు. మహబూబాబాద్ జిల్లా గార్ల బయ్యారానికి చెందిన గుండపాటి లలిత (34) కూలి పనుల కోసం తొర్రూర్‌కు వచ్చి సత్యమ్మ ఇంట్లోని ఓ గదిలో అద్దెకు ఉంటోంది. చంద్రశేఖర్ భవన నిర్మాణ పనులకు వచ్చే సమయంలో లలితతో రాకేష్‌కు పరిచయమైంది. వీరు వివాహేతర సంబంధాన్ని కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో లలిత కోసం వచ్చే రాకేష్.. సత్యమ్మతో పరిచయం పెంచుకున్నాడు. ఆమె వద్ద బంగారు ఆభరణాలు ఉన్నట్లు గుర్తించాడు. ఆదివారం రాత్రిపూట సత్యమ్మ ఇంటి ముందు కూర్చొని ఉండగా రాకేష్ నెమ్మదిగా లోపలికి ప్రవేశించి దాక్కున్నాడు. అనంతరం వృద్ధురాలు ఇంటిలోపలికి వెళ్లి మంచం మీద నిద్రించింది. రాకేష్ తలుపులు తెరిచి లలితను ఇంట్లోకి పిలిచాడు. సత్యమ్మ ముఖంపై దిండు పెట్టాడు. కాళ్లు కదలకుండా లలిత పట్టుకుంది. ఊపిరాడకపోవడంతో సత్యమ్మ మృతి చెందింది. ఆమె దగ్గర ఉన్న రెండు వరుసల బంగారు గొలుసు, 7 బంగారు గాజులు, చేతి కడియం, ఉంగరాలు తీసుకుని నిందితులు పారిపోయారు. ఘటనా స్థలాన్ని రాచకొండ పోలీసు కమిషనర్ చౌహాన్, డీసీపీ సాయిశ్రీ తదితరులు పరిశీలించారు. క్లూస్ టీమ్, డాగ్‌స్క్వాడ్, ఫింగర్ ప్రింట్ల ఆధారంగా నిందితులు రాకేష్, లలితను అరెస్టు చేశారు. కేసును గంటల వ్యవధిలోనే ఛేదించిన పోలీసులను డీసీపీ అభినందించారు.